బ్రహ్మోత్సవాలకు ఆలయాలు ముస్తాబు

- 2వ తేదీ నుంచి 5 వరకు కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి వేడుకలు
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు


నూతన ఆలయం (ఇన్‌సెట్‌లో) కోనాయిపల్లి వేంకటేశ్వరుడు

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి కావడంతో ఆలయానికి కల్యాణ శోభ సంతరించుకుంది. నూతన ఆలయం పూర్తయిన తర్వాత జరుగుతున్న మొదటి బ్రహ్మోత్సవాలు కావడంతో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 2 నుంచి 5 వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రముఖులు పాల్గొననున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు

మంత్రి హరీశ్‌రావు కృషితో కొత్త హంగులు

ఆలయ విస్తరణ కోసం స్థలం అవసరం కావడంతో పక్కన ఉన్న ఇంటి యజమానులు స్థలాన్ని ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో మంత్రి హరీశ్ ప్రత్యేక చొరవ తీసుకొని దేవాదాయ, ధర్మాదాయ శాఖకు ప్రతిపాదనలు పంపడంతో రూ.3కోట్ల 50 లక్షలు, ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించడంతో నిర్మాణం పూర్తయింది. అన్ని హంగులతో నిర్మాణం పూర్తి కాగా పద్మావతి, గోదాసమేత వేంకటేశ్వరస్వామి, హనుమాన్ యంత్ర ప్రతిష్ఠ చేశారు.

కార్యక్రమాల వివరాలు

గురువారం విశ్వక్సేన ఆరాధన, అంకురార్పన, రక్షాబంధనం, శుక్రవారం ధ్వజారోహనం, దేవతాహవనం, నిత్యహోమం, 12 గంటలకు భూనీశా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, ద్వార దోరణం, శనివారం ధ్వజ కుంభారాధన, సుదర్శన హోమం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, ఆదివారం చతుఃస్థానార్చన, నిత్యహోమం, స్వామివారి అభిషేకం, చక్రస్నానం, ఏకాంతసేవ, ఆశీర్వచనంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయం సిద్ధం



తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురంలో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం కల్యాణ మహోత్సవాలకు సిద్ధమైంది. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా 3 నుంచి 6వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 3వ తేదీ రాత్రి పుట్ట బంగారం తెచ్చుట, 4వ తేదీ ఉదయం 9.00 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, 11.00 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, నిత్యహోమం, 5వ తేదీ ఉదయం 9.00 గంటలకు నిత్యహోమం, 11.00 గంటలకు గరుడోత్సవం, రాత్రి 10.00 గంటలకు రథోత్సవం, 6వ తేదీ ఉదయం 10.00 గంటలకు మహాపూర్ణాహుతి, చక్రస్నానం (జాతర) కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు స్వామివారి ఆలయం రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివారి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారని నిర్వాహకులు తెలిపారు.

సిద్దిపేటకు చేరుకున్న సాయిదీక్షాపరుల పాదయాత్ర


సాయిదీక్షాపరులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఖమ్మం జిల్లా రఘునాథపాలెం నుంచి మహారాష్ట్రలోని శిరిడీ సాయిబాబా ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న సాయిదీక్షాపరుల పాదయాత్ర మంగళవారం సిద్దిపేటకు చేరుకుంది. జనవరి 22న ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలోని శిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం సిద్దిపేట పట్టణానికి చేరుకుంది. దీంతో పట్టణంలోని శిరిడీ సాయిబాబా ఆలయంలో సాయిదీక్షాపరులకు అన్న ప్రసాదాలు అందించి, సన్మానించారు. అనంతరం సాయిదీక్షాపరులు శిరిడీకి పాదయాత్రగా బయలుదేరారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో ఉధృతి నివారణ


పురుగు ఉధృతి తెలుసుకుంటున్న ఏఈఓ శ్రావ్య

చేర్యాల(సిద్దిపేట): వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతి తెలుసుకునేందుకు లింగాకర్షక బుట్టలు వాడాలని ఏఈఓ శ్రావ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దరాజుపేటలో బొంగురం రమేశ్‌రెడ్డికి చెందిన పొలంలో ఎకరానికి 5 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి కాండం తొలిచే పురుగు ఉధృతి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా మగ పురుగులు ల్యూర్ నుంచి వచ్చే ఆడపురుగు వాసనకు ఆకర్షించబడి పొలంలో ఏర్పాటు చేసిన బుట్టలో పడతాయన్నారు. మగ పురుగులు 18 నుంచి 20 ఉంటే ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు కావున రైతులు అప్రమత్తమై రసాయన మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. ఆమె వెంట వీఆర్‌ఏ మల్లేశం, రైతులు ఉన్నారు.

చీడపీడల నివారణకు చర్యలు చేపట్టండి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లి, కస్తూరిపల్లి గ్రామాల్లో పంట పొలాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొలంలో పిలకలు వేసే దశలో వరి పిలకలు చనిపోవడం, ఆకుముడత పురుగు గమనించినప్పుడు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పిలక దశలో ఎకరాకు మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి అందులో వారానికి బుట్టకు 25 నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కాండం తొలిచే పురుగు, మొగిపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసిన వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు ప్రాధాన్యం కల్పించాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్


ధర్నా కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): దళితబంధు పథకంలో నిరుపేద దళితులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తూ పారదర్శకంగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ అన్నారు. దళితబంధు పథకం విధి విధానాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధు లబ్ధిదారుల ఎంపిక కలెక్టర్‌ల ద్వారా జరపాలన్నారు. పథకంలో జరిగిన అక్రమాలపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట, 14న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లం, పరశురాములు, కనకయ్య, మల్లేశం, మొండయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

చదివిన బడికి సేవ చేయడం అదృష్టం


లక్ష్మణ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన లక్ష్మణ్‌గౌడ్ సహకారంతో మంగళవారం టై, బెల్ట్‌లు, బ్యాడ్జీలు, పెన్నులు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ.. పుట్టిన ఊరు, తాను చదివిన పాఠశాల విద్యార్థులకు సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, రాములు, సురేష్‌కుమార్, సునీత, దేవకి, వాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం దాత లక్ష్మణ్‌గౌడ్‌ను సన్మానించారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం


పట్నం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మర్కూక్(గజ్వేల్): రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మండలంలోని పాతూరు గ్రామంలో ఆలయ అర్చకులు బుకల భాగ్యమ్మ, యాదగిరి ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవంలో భాగంగా రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అర్చకులు పెద్దపట్నం వేశారు. అలాగే అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణనర్సింలు, ఉపసర్పంచ్ నాగరాజు తదితరులు అమ్మవారికి పూజలు చేశారు.

అందరూ కలిసి మెలసి ఉండాలి


నంగునూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న సారయ్య

నంగునూరు(సిద్దిపేట): కుల వివక్ష పాటించకుండా అందరూ కలిసి మెలసి ఉండాలని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. మంగళవారం ముండ్రాయిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించి సివిల్ రైట్స్, కుల వివక్ష పాటిస్తే జరిగే పర్యవసానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సారయ్య, ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, కులవివక్ష పాటించినా, జోగిని వ్యవస్థను ప్రోత్సహించినా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో రాజయ్య, చందు, సంజీవ్, వార్డుసభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో మంగళవారం సర్పంచ్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.కె.ఆరీఫా మాట్లాడుతూ.. కులవివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, నాయకులు నవజీవన్, సత్యనారాయణ, రాజయ్య, శ్రీనివాస్, రమేష్, శ్రీహరి, వీఆర్‌ఏలు, కారోబార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: ప్రజలంతా కలిసికట్టుగా ఉంటూ గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కోమటిబండ గ్రామంలో సర్పంచ్ తూం శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా సమానంగా జీవించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో హక్కులను కల్పించారని తెలిపారు. ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, తహసీల్దార్ బాల్‌రాజు, ఆర్‌ఐ కృష్ణ, ఆత్మకమిటీ డైరెక్టర్ భాస్కర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని గిరాయిపల్లిలో సర్పంచ్ కాసపురం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ రామేశ్వర్ గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతులు అమలులో ఉన్నాయా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. దళిత కాలనీల్లో జరిగిన అభివృద్ధి పనులు, ఇంకా జరగాల్సిన అభివృద్ధి పనుల విషయంపై చర్చించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఏఎస్‌ఐ, పంచాయతీ కార్యదర్శి, వార్డుసభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ శిబిరం ప్రారంభం


గజ్వేల్‌లో ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు


గొడుగుపల్లిలో అద్దాలు అందజేస్తున్న జెడ్పీటీసీ జ్యోతి

గజ్వేల్‌రూరల్: కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గజ్వేల్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఐవోసీలోని సీ బ్లాక్‌లో గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకీయొద్దీన్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఏటీవో హైదర్‌అలీ, ఏడీఏ బాబు నాయక్, ఎంపీడీవో పట్టాభిరామారావు, పీఆర్‌డీఈఈ అజయ్, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయరాణి, టీఎన్‌జీవో గజ్వేల్‌శాఖ అధ్యక్షుడు లింగంతో పాటు స్థానిక కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని పట్టణంలోని 3వ వార్డు పరిధి రంగధాంపల్లిలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ కనకరాజు ప్రారంభించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: మండలంలోని గొడుగుపల్లి గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని దౌల్తాబాద్ జెడ్పీటీసీ రణం జ్యోతి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ శివకుమార్, ఎంపీటీసీ లక్ష్మి, వైద్యులు ఉన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామంలో శిబిరాన్ని ఎంపీపీ పుష్పలత ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్నస్వామి, ఎంపీటీసీ రాంరెడ్డి, ఎంపీడీఓ భాస్కరశర్మ, పీఏసీఎస్ చైర్మన్, మెడికల్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

‘మంత్రి హరీశ్‌రావును విమర్శిస్తే ఊరుకోం’


మాట్లాడుతున్న మణిదీప్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: మంత్రి హరీశన్న ప్రజల మనిషి , ప్రజా సేవకుడు అలాంటి వ్యక్తిని విమర్శించడం మానుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు మణిదీప్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, నవీన్‌లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మణిదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్దవాళ్లను విమర్శించినంత మాత్రాన నువ్వేం పెద్దవాడివి అయిపోవని చక్రధర్‌గౌడ్‌ను ఉద్దేశించి విమర్శించారు. చక్రధర్‌గౌడ్ మొదట్లో రైతులకు సాయం చేసినప్పుడు తాను కూడా అభినందించానని, సేవ ముసుగులో రాజకీయం చేయడం పనికిమాలిన చర్య అని మండిపడ్డారు. హరీశ్‌రావు మచ్చలేని నాయకుడని తనపై ఇష్టారీతిన మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మహిళా చట్టాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేందర్

దుబ్బాక: సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక ఎస్సై బత్తుల మహేందర్ అన్నారు. మంగళవారం దుబ్బాక బస్టాండ్‌లో కళాశాల విద్యార్థినులకు మహిళా చట్టాలు, ఫోక్సో చట్టాలు, సైబర్ క్రైమ్, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, డయల్ 100 పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు షీటీమ్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఆన్‌లైన్ మోసాల ఉచ్చులో ఎవరూ పడకూడదని సూచించారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని తల్లిదండ్రుల గౌరవం కాపాడేలా ముందుకు సాగాలన్నారు.

‘బోగ్ బండార్’ను విజయవంతం చేయాలి


స్థలాన్ని పరిశీలిస్తున్న రామ్‌చందర్‌నాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఫిబ్రవరి 6వ తేదీన అక్కన్నపేట మండల కేంద్ర పరిధిలోని చౌదుతండాలో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి, బోగ్ బండార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీ మాలోతు రామ్‌చందర్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన చౌదు తండాలో సేవాలాల్ బోగ్ బండార్ నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గిరిజన తండాల నుంచి పెద్ద ఎత్తున్న గిరిజనులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజునాయక్, సేవాలాల్ జయంతి నిర్వాహక అధ్యక్షులు తిరుపతినాయక్, బంజారా మహిళా అధ్యక్షురాలు మాలోతు లక్ష్మిబాయి తదితరులు పాల్గొన్నారు.

దుకాణ సముదాయాలకు బహిరంగ వేలం

దుబ్బాకటౌన్: పట్టణంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లతో మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుందని చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 14వ వార్డులో లాల్‌బహదూర్ శాస్త్రీ చౌరస్తాతో పాటు డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నిర్మించిన దుకాణ సముదాయాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీ విగ్రహం వద్ద 13 దుకాణాలకు గాను కేవలం 6వ నంబర్ దుకాణానికి, డబుల్ బెడ్రూంల వద్ద 2, 4, 5 దుకాణాలకు మాత్రమే దరఖాస్తులు రావడంతో వాటికి మాత్రమే బహిరంగ వేలం నిర్వహించారు. ఈ బహిరంగ వేలంలో 4 దుకాణాలకు నెలకు రూ.3200 చొప్పున అద్దెను నిర్ణయించామని కమిషనర్ గణేశ్‌రెడ్డి తెలిపారు. మిగిలిన దుకాణాలకు త్వరలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆస యాదగిరి, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్): ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో జరిగే మరమ్మతుల కారణంగా దూళ్మిట్ట మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని దూళ్మిట్ట ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పీజీ కోర్సులో 55శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, సెట్, నెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 3న సాయంత్రం 4గంటల లోపు పూర్తి బయోడేటాతో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈ నెల 4న మధ్యాహ్నం 2గంటలకు కళాశాలలో డెమో, ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాల(9666494466)లో సంప్రదించాలన్నారు.

◆ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జి.జీవన్‌కుమార్

సిద్దిపేట ఎడ్యుకేషన్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సిద్దిపేట ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జి.జీవన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఫలక్‌నామా డిగ్రీ కళాశాల నుంచి పదోన్నతిపై వచ్చిన జీవన్‌కుమార్‌కు కళాశాల ప్రస్తుత ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.సీతారాములు బాధ్యతలు అప్పగించారు. కాగా డాక్టర్ జీవన్ కుమార్ గతంలో వరంగల్, జనగామ, హైదరాబాద్ డిగ్రీ కళాశాలల్లో పనిచేసి సుదీర్ఘ అనుభవంతో పదోన్నతిపై మహిళా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా రావడంపై కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, జ్యోతి, హరిప్రసాద్, కిషోర్, రవికుమార్ తదితరులు స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

◆ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుపుతామని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 2, 17వ వార్డుల్లో జరుగుతున్న సీసీరోడ్లు, ముట్రాజ్‌పల్లిలోని మైనార్టీ గ్రేవ్‌యార్డు పనులను మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఈ కిష్టన్న, ఏఈ శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

◆ విగ్రహ ఏర్పాటుకు విరాళం

దుబ్బాక: పట్టణ కేంద్రంలో కొత్వాల్ రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహ ఏర్పాటుకు దుబ్బాక రెడ్డి రైతు యువజన సంఘం తరపున రూ.10వేల విరాళం మంగళవారం దుబ్బాక మండల రెడ్డి జేఏసీ అధ్యక్షుడు గడీల జనార్దన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి రైతు యువజన సంఘం అధ్యక్షుడు రేపాక రాంరెడ్డి, నాయకులు రాంచెర్ల బాపురెడ్డి, దాసారం ఎల్లారెడ్డి, తదితరులున్నారు.

క్లుప్తంగా

ఎంఈఓకు సన్మానం


సన్మానిస్తున్న పీఆర్టీయూ సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): నూతనంగా ఏర్పడిన అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి ఎంఈఓగా జోగు ప్రభుదాస్ బాధ్యతలను స్వీకరించడంపై పీఆర్టీయూ మండల సభ్యులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. భూంపల్లి ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ప్రభుదాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సోమగారి నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొండం శ్రీకాంత్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశం, కనకారెడ్డి, హెచ్‌ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు అంజాగౌడ్, ప్రవీణ్ బాబు, చక్రపాణి, పుష్పవేణి, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న జనార్దన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టబోయే వార్షిక బడ్జెట్లో విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్‌లతో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో 8 సంవత్సరాల నుంచి విద్యకు మూడు శాతం మించి నిధులు ఇవ్వడం లేదని, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కుంటుపడేలా చేస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యకు నిధులు అధికంగా కేటాయించాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులందరం నిరసనలకు దిగుతామన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన విద్యార్థి సంఘం నేడు దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు రూపొందించిన బీఆర్‌ఎస్వీ జనగామ నియోజకవర్గ కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తరిగొప్పుల జెడ్పీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు రాజాబాబు, బాబు, రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం


విరాళం అందిస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న విద్యా వలంటీర్ల కోసం లక్ష రూపాయల విరాళాన్ని ఫంక్షన్ హాల్ నిధుల నుంచి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భాగ్యభిక్షపతి మాట్లాడుతూ.. పాఠశాలలో ఉపాధ్యాయులు తక్కువగా ఉండడంతో గ్రామస్తుల సహకారంతో విద్యా వలంటీర్లను పెట్టుకున్నామని చెప్పారు. వారి కోసం నిధులు కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ధనలక్ష్మి, నాయకులు కొమురయ్య, బాబు, హెచ్‌ఎం సంధ్యారాణి, యాదగిరి, సత్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ములుగు(గజ్వేల్): గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ములుగు మండలం కొక్కొండ సర్పంచ్ బంగ్ల గణేశ్‌తో పాటు గ్రామస్తులు మంగళవారం హైదరాబాద్‌లో ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఇళ్లపై నుంచి ఏర్పాటు చేసిన 11కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతుండటంతో ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని వారు మంత్రికి వివరించారు. వైర్లను తొలగించాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. గతంలో విద్యుత్ తీగలు తగిలి ముగ్గురు స్థానికులు మరణించారని పేర్కొన్నారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను తొలగించి సరిచేసేలా చర్యలు చేపట్టాలని మంత్రికి విన్నవించారు. ఈ మేరకు తగు చర్యలు చేపట్టాలని మంత్రి గజ్వేల్ గడా అధికారిని ఆదేశించారు.